ఉక్కు ఉద్యోగుల్లో పీఎఫ్ టెన్షన్!


విధులకు హాజరవుతున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు

- అర్నెల్లుగా చెల్లించని యాజమాన్యం
- రూ. 335 కోట్లకు చేరిన బకాయిలు
- ఎన్ఆర్ఎల్, వీపీఎఫ్ నిలిపివేత
- ఉద్యోగుల ఖాతాల్లో జమకాని పీఎఫ్ వడ్డీ

నగటు వేతన జీవికి భరోసా పీఎఫ్. అత్యవసర సమయంలో ఆదుకునే సంజీవని. పిల్లలను పెద్ద చదువులకు పంపాలన్నా.. వివాహాలు చేయాలన్నా.. ఆరోగ్యం దెబ్బతింటే వైద్యం చేయించుకోవాలన్నా అదే పెద్ద దిక్కు. అలాంటి కీలకమైన పీఎఫ్ చెల్లింపు విషయంలో ఉక్కు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నష్టాలు ఉన్నాయన్న షాకుతో ఉద్యోగుల వేతనాల నుంచి కటింగ్ చేసిన మొత్తంతో పాటు యాజమాన్యం వాటా కూడా ఆర్నెల్లుగా చెల్లించలేదు. దీంతో ఉద్యోగులకు ఎన్ఆర్ ఎల్, వీపీఎఫ్ సదుపాయాలు నిలిచిపోయాయి. పీఎఫ్ కమిషనర్ నుంచి రెండు సార్లు నోటీసులు వచ్చినా యాజమాన్యంలో కదలిక లేదు. ఫలితంగా ఉక్కు ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.


స్టీల్‌ప్లాంట్ ముఖ చిత్రం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కష్టాలు ఎదుర్కొంటున్నారు. యాజమాన్యం పీఎఫ్ ట్రస్ట్‌కు ఆర్నెల్లుగా నగదు జమ చేయలేదు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పీఎఫ్ సొమ్మును ప్లాంట్ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో కూడిన పీఎఫ్ ఎగ్జెంప్టెడ్ ట్రస్ట్ నిర్వహిస్తోంది. ఉద్యోగులు తమ అవసరాల కోసం రిటర్నబుల్ లోన్ (ఆర్ఎల్), నాన్ రిటర్నబుల్ లోన్ (ఎన్ఆర్ఎల్)లను ఉపయోగించుకునేవారు. యాజమాన్యం సకాలంలో నగదు జమ చేయకపోవడంతో ట్రస్టులో నిల్వలు తగ్గిపోయాయి. ఫలితంగా నాన్ రిటర్నబుల్ లోన్‌ను ట్రస్ట్ తాత్కాలికంగా నిలిపివేసింది. అదే విధంగా గతంలో ఉండే వలంటరీ పీఎఫ్‌ను కూడా నిలిపివేయాలని నిర్ణయించింది. దీనికి తోడు ఉద్యోగి పదవీ విరమణకు 11 నెలల ముందు తీసుకునే 90 శాతం ఎన్ఆర్ఎల్ సదుపాయం కూడా నిలిచిపోయింది. కష్టార్జితంతో దాచుకున్న పీఎఫ్ సొమ్ము అవసరాలకు అందకపోవడంతో ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

ట్రస్ట్‌కు బకాయిపడ్డ యాజమాన్యం

యాజమాన్యం ఉద్యోగుల జీతం నుంచి కట్ చేసిన పీఎఫ్ అమౌంట్‌తో పాటు యాజమాన్యం వాటాను పీఎఫ్ ట్రస్ట్‌కు ప్రతీ నెలా జమ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ట్రస్ట్‌కు నగదు జమ చేయకపోవడంతో ఆ బకాయి రూ. 335 కోట్లకు చేరింది.

జమ కాని వడ్డీ

గతేడాది కేంద్ర ప్రభుత్వం పీఎఫ్‌పై 8.25 శాతం వడ్డీ ప్రకటించింది. యాజమాన్యం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ట్రస్ట్‌కు పీఎఫ్ నగదు జమ చేయకపోవడంతో ట్రస్ట్ ప్రతినిధులు 2023–24కు ఉద్యోగుల ఖాతాలకు వడ్డీ ఇంత వరకు జమ చేయలేదు. ఉదాహరణకు ఒక ఉద్యోగి ఖాతాలో రూ. 40 లక్షలు పీఎఫ్ ఉంటే అతనికి సుమారు రూ. 3.5 లక్షలు వడ్డీ జమ చేయాల్సి ఉంది. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది.

పీఎఫ్ కమిషనర్ నోటీసులు ఇచ్చినా..

పీఎఫ్ నగదు జమ చేయాలని పీఎఫ్ ట్రస్ట్ ప్రతినిధులు యాజమాన్య ప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు జరిగే నష్టాన్ని వివరించారు. అయినప్పటికీ యాజమాన్యం నుంచి స్పందన కనిపించలేదు. ఈపీఎఫ్‌వోకు ట్రస్ట్ తరఫున ప్రతీ నెలా ఆన్‌లైన్ రిటర్న్‌లు పంపకపోవడంతో ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఉక్కు యాజమాన్యానికి రెండు సార్లు నోటీసులు పంపారు. అయినప్పటికీ యాజమాన్యం నుంచి స్పందన కనిపించడం లేదు.

తప్పించుకోవడం అసాధ్యమని తెలిసినా..

ప్రావిడెంట్ ఫండ్ చట్టం 1952లోని 14ఆ సెక్షన్ ప్రకారం సంస్థ ఏ పరిస్థితుల్లో ఉన్నా పీఎఫ్ జమ చేసి తీరాల్సిందే. ఆ సంస్థకు ఎన్ని అప్పులు ఉన్నా, మూసివేతకు సిద్ధంగా ఉన్నా మొదట పీఎఫ్‌కు వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంది. ఆ తర్వాత మాత్రమే మిగిలిన అంశాలను పరిష్కరించాలని పీఎఫ్ చట్టం స్పష్టంగా చెబుతోంది. లేనిపక్షంలో ఆ సంస్థ ఆస్తులను జప్తు చేసే అధికారం ఉందని పీఎఫ్ చట్టంలో ఉంది. ఇన్‌కమ్‌ట్యాక్స్, జీఎస్టీ వలే చట్టబద్ధమైన పీఎఫ్‌పై ఉక్కు యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తే తప్పకుండా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

యాజమాన్యం చెల్లించలేదు



పీఎఫ్ ట్రస్ట్‌కు యాజమాన్యం ఆర్నెల్లుగా నగదు చెల్లించడం లేదు. దాని వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అనేక ఇబ్బందులు పడి రిటర్నబుల్ రుణాలు, ఎన్ఆర్ఎల్ రుణాలు, 90 శాతం ఎన్ఆర్ఎల్ ఇచ్చాం. పరిస్థితి దిగజారడంతో ట్రస్ట్ భవిష్యత్తు దృష్ట్యా ఎన్ఆర్ఎల్, 90 శాతం ఎన్ఆర్ఎల్, వీపీఎఫ్ తాత్కాలికంగా నిలిపి వేయాల్సి వచ్చింది. యాజమాన్యం నుంచి నగదు అందితే యథావిధిగా అన్ని సదుపాయాలు కల్పిస్తాం.

– చీకటి శ్రీనివాస్, పీఎఫ్ ట్రస్ట్ సభ్యుడు, స్టీల్‌ప్లాంట్

క్లుప్తంగా

రాజకీయ నిర్ణయంతోనే స్టీల్‌ప్లాంట్ రక్షణ

- నేడు గాజువాకలో మహా ధర్నా


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ రాజకీయ నిర్ణయంపైనే ఆధారపడి ఉందని సీపీఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి పి. శ్రీనివాసరాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆదివారం గాజువాకలో జరిగే మహాధర్నా గోడప్రతులను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన ప్లాంట్‌ను కాపాడడానికి రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి కేంద్రానికి వాణి వినిపించాలని డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గాజువాకలో చేపట్టే మహా ధర్నాలో ఉక్కు ఉద్యోగులు కుటుంబ సభ్యులతో హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యు. రామస్వామి, కె.ఎం. శ్రీనివాస్, వై.టి. దాస్, టి.వి.కె. రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎన్ గార్డెన్‌లో ఘనంగా వినాయక పూజలు


పూజలు చేస్తున్న కాపు జగ్గరాజుపేట వాసులు

అక్కిరెడ్డిపాలెం: వినాయక చవితి వేడుకలను ఎస్టీబీఎల్‌లోని ఎల్ ఎన్ గార్డెన్స్ కాపుజగ్గరాజు పేటలో ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతించాలని వినతి

అగనంపూడి: నివాస స్థలం క్రమబద్ధీకరణ పత్రాలు మంజూరు చేసినా రెవెన్యూ అధికారులు ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్నారని 85వ వార్డు కొండయ్యవలసకు చెందిన అంబేడ్కర్, జ్యోతిరావ్‌పూలే సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. వెనుకబడిన, షెడ్యూల్ జాతికి చెందిన 100 కుటుంబాలు రెండు దశాబ్దాలుగా నివసిస్తుండడంతో 2016లో అప్పటి ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే ఆ ప్రాంతంలోనే అధికారులు హైటెన్షన్ విద్యుత్ లైన్లు వేస్తుండడంతో పాటు ఇంటి నిర్మాణాలు అడ్డుకుంటున్నారని పట్టా పైడిరత్నం, రమణమ్మ, కర్రి దశేంద్ర వివరించారు.

స్టీల్‌ప్లాంట్‌లో స్వచ్ఛతా హీ సేవ ప్రారంభం


ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలో ప్రతిజ్ఞ చేస్తున్న డైరెక్టర్లు, అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే, డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్, డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎన్. ప్రసాద్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. కరుణ రాజుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అదే విధంగా వివిధ విభాగాల్లో విభాగాధిపతుల నేతృత్వంలో సీనియర్ అధికారులు, ఉద్యోగులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అక్టోబర్ 1 వరకు నిర్వహించనున్న పక్షోత్సవాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలవిద్యార్థులకు సుభోజనం

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సమీపంలోని జీఎస్ ఫౌండేషన్‌లోని అనాథ బాలలకు ఉపాధ్యాయురాలు బూసి డెల్ఫినా, ఉక్కు ఉద్యోగి కె.రమేష్ దంపతులు సుభోజనం సౌకర్యం కల్పించారు. బూసి యోనాతా వర్ధంతిని పురస్కరించుకొని విద్యార్థులకు సుభోజనంతో పాటు పండ్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో కె.రోషన్, మౌనిక, జొన్నకూటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

అగనంపూడి: హైదరాబాద్‌కు చెందిన యంగ్ ఇన్నైస్ సంస్థ ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో అగనంపూడి సమీపంలోని ఏబీఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వీరిలో ఆరుగురికి బంగారు పతకాలు, 13 మందికి రజత పతకాలు దక్కాయని పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. వీరందర్నీ శనివారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు పీఎం కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజ, డైరెక్టర్ దీపక్ పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు సన్యాసిరావుకు నివాళి

గాజువాక : ప్రజానాట్యమండలి సీనియర్ నాయకుడు, రచయిత, గాయకుడు గంగిరెడ్ల సన్యాసిరావు మృతికి జిల్లా పౌర హక్కుల సంఘం సీనియర్ నాయకుడు తుంపాల శ్రీరామ్మూర్తి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన ఐదు దశాబ్దాలపాటు అన్ని జిల్లాల్లో పర్యటించి అనేక అంశాలపై శ్రమజీవుల కోసం పాటలు పాడి ప్రజలను చైతన్యపరిచారని పేర్కొన్నారు. బీహెచ్‌పీవీలో ఉద్యోగం చేస్తూ సుమారు రెండువేల పాటలు రాసి స్వరపరిచారని పేర్కొన్నారు. ఆయన మృతి ప్రజా కళాకారులకు తీరని లోటన్నారు. సన్యాసిరావు కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటించారు.

విశేష పూజలు.. అన్న సమారాధనలు


అప్పికొండలో అన్న సమారాధనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


లక్ష్మీపురం కాలనీలో వడ్డన చేస్తున్న కోమటి శ్రీనివాసరావు


క్వారీరోడ్డులో భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి


చందన అలంకరణలో పెదమడక గణేశుడు


భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డిస్తున్న బట్టు పైడిరెడ్డి

అగనంపూడి: వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పూజలతో పాటు అన్నసమారాధనలు నిర్వహిస్తున్నారు. 87వ వార్డు వడ్లపూడి నిర్వాసితకాలనీ అప్పికొండలో గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొద్ద గోవింద్, ప్రగడ వేణుబాబు, చిత్రాడ రమణ, ఆడారి శ్రీను పాల్గొన్నారు.

– కణితి నిర్వాసితకాలనీ లక్ష్మీపురం కాలనీలోని రమాదేవి మహిళా మండలి సారథ్యంలో, అప్పికొండ రామాలయం, శెట్టి బలిజ వీధి, అప్పికొండ, వడ్లపూడి గణేష్ యూత్, కణితి, విశ్వబ్రాహ్మణ వీధి, శ్రీరామ్‌నగర్, గణేష్ సేవా సంఘం, గవర వీధి, తైనాల దొడ్డి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు పాల్గొని పూజలు చేసి అన్న సమారాధనలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెర్రిపోతుల ఈశ్వరరావు, వడ్లపూడి ఈశ్వరరావు, ఎన్నేటి రమణ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో చందనోత్సవం

జీవీఎంసీ 85వ వార్డు పెదమడక సంపత్ వినాయక ఆలయంలో 8వ రోజు స్వామి వారికి చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తికి చందనం పూశారు. కార్యక్రమంలోఉత్సవ కమిటీ నాయకులు మోటూరి వెంకటరమణ, మాడుగుల నరసింగరావు, విందుల నారాయణరావు, వంకర రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధనలు

పెదగంట్యాడ: గణపతి నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శనివారం భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. జీవీఎంసీ 77వ వార్డు పిట్టవానిపాలెం దరిజై కాలనీలో నిర్వహించిన అన్నసమారాధనను వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు బట్టు పైడిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బట్టు అప్పలరెడ్డి, తాతరెడ్డి, పి. పెంటయ్య, సతీష్, పిట్ట వెంకటరెడ్డి పాల్గొన్నారు.

- జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్ రోడ్ నెం● 2 లో పిల్లల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధను నాయకులు సింగంపల్లి దేముడు, ఈశ్వరరావు ప్రారంభించారు.
- 74వ వార్డు క్వారీ రోడ్డులో చాలెంజ్ స్టార్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. అంతక ముందు గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం


హిందీ భాషా దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు


విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు మాట్లాడుతూ దేశ రాజభాష హిందీ అని, అది సరళంగా, సహజంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు హిందీ కవులు, వారి కలం నుంచి వెలువడిన సాహిత్య విశేషాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ హిందీ ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరించారు. హిందీ నేర్చుకోవడం ద్వారా దేశంలో ఎక్కడైనా, ఎవరితోనైనా సునాయాసంగా భావ వ్యక్తీకరణ చేసే అవకాశం ఉంటుందన్నారు. హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి టి.ఎల్లేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.తేజేశ్వరరావు, హిందీ అధ్యాపకురాలు కె.సుధారాణి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

హిందీభాషలో ప్రావీణ్యం అవసరం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని అరబిందో ఐడియల్ పాఠశాలలో హిందీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కవితలు, సూక్తులు, గేయాలతో తమ భాషా ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వి. రామారావు విద్యార్థులు హిందీ భాషపై ప్రావీణ్యం సాధించాలన్నారు. . సమన్వయకర్త టి.ఎల్లేశ్వరరావు మాట్లాడుతూ దేశ సమగ్రత కాపాడడానికి హిందీ భాష ఒక సాధనమన్నారు. ప్రిన్సిపాల్ జోసెఫ్ , ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫెస్ట్‌లతో మేధోశక్తికి పదును


పారితోషికం చెక్ అందిస్తున్న అతిథులు

అగనంపూడి: విద్యార్థుల్లో మేధోశక్తిని పెంపొందించడానికి సాంకేతిక సదస్సులు, ప్రదర్శనలు దోహదపడతాయని మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్ర శర్మ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన విస్తా టెక్ ఫెస్ట్ 2024 ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టెక్ ఫెస్ట్ లు ఆవిష్కరణలకు ఉపయోగపడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో పరిశోధనా రంగంలో రాణించాలన్నారు. ఉత్తమ ప్రదర్శనలు ఏర్పాటు చేసిన విద్యార్థులకు నగదు పారితోషికం అందించారు. కార్యక్రమంలో మెడివాల్ సీఈవో దిలీప్‌కుమార్ చేకూరి, దయానంద తోరాటి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 579 కేసుల పరిష్కారం


మాట్లాడుతున్న 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక: గాజువాక కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 579 కేసులు పరిష్కారమయ్యాయి. పరిష్కారమైన కేసుల విలువ రూ.5.36 కోట్లుగా కోర్టు వర్గాలు తెలిపాయి. శిబిరాన్ని 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.షణ్ముఖరావు ప్రారంభించారు. అనంతరం వివిధ బెంచీల్లో కొనసాగిన అదాలత్ శిబిరాల్లో కక్షిదారులు తమ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకున్నారు. 8వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో రూ.2.36 కోట్ల విలువైన 28 కేసులు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.1.15 కోట్ల విలువైన 44 కేసులు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.33.75 లక్షల విలువైన 3 కేసులు, బ్యాంకు మేటర్‌కు సంబంధించి రూ.1.83 లక్షల విలువైన ఒక కేసుతో పాటు 8వ ఏసీఎంఎం కోర్టులో రూ.66.01 లక్షల విలువైన 220 కేసులు, 3వ ఏసీఎంఎం కోర్టులో రూ.82.79 లక్షల విలువైన 283 కేసులు పరిష్కారమైనట్టు కోర్టు వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో న్యాయమూర్తులు వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, పి.ప్రదీప, సీనియర్ న్యాయవాదులు, గాజువాక బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వంటల పోటీలు

అగనంపూడి: విద్యార్థుల ఆరోగ్యంపై ఎంత శ్రద్ధ తీసుకుంటామో, ఆహారం పట్ల కూడా అంతే శ్రద్ధ తీసుకోవాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలావతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా లీఫార్మా, లీహెల్త్ డొమైన్ సంయుక్తంగా శనివారం కూర్మన్నపాలెంలోపాఠశాలలో విద్యార్థుల తల్లులకు ఆరోగ్యకరమైన ఆహార పోటీలు నిర్వహించారు. తల్లులు వండిన వంటల, వాటిలో ఉన్న పోషకాలు, రుచులు చూశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ జయలక్ష్మి పాల్గొన్నారు.